యూనిట్ 1

# ౨. చుక్కల లెక్కలు

చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఉన్నది ఎవరు?
★ ఆయన ఏం చేస్తున్నారు?
★ చిత్రం ఆధారంగా కథను ఊహించి చెప్పండి.

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.
★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.
★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ఒకరోజు రాత్రి అక్బరు పాదుషా, తన అంతఃపురంలో పచార్లుచేస్తూ ఆకాశంవైపు చూశాడు. నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి. వాటిని ఒకటి.... రెండు.... మూడు.... అని లెక్కపెట్టసాగాడు. తరవాత తను చేస్తున్న పనికి తనకే నవ్వు వచ్చింది. "ఒక తమాషా చేద్దాం!" అనుకున్నాడు అక్బరు. మరుసటి రోజున, "ఆకాశంలో నక్షత్రాలు ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టి ఎవరైనా చెప్పగలరా?" అని సభలో అడిగాడు.

అంతా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. పాదుషా తమను ఆటపట్టిస్తున్నాడేమో అని వాళ్ళకు అనుమానం వచ్చింది. ఇంతలోనే మళ్ళీ అక్బరు, "నక్షత్రాలను లెక్కపెట్టినవారికి వెయ్యి బంగారు నాణేలు బహుమతి. దీనికి పదిహేను రోజుల గడువు ఇస్తున్నాను," అని చెప్పాడు. పదిహేను రోజులు గడిచిపోయాయి. "నక్షత్రాలను ఎవరయినా లెక్కపెట్టారా?" అని సభలో అక్బరు అడిగాడు. "లేదు, ప్రభూ," అన్నారు అంతా.

అక్బరుకు బీర్బల్ కనిపించలేదు. "బీర్బల్‌గారు ఏరీ?" అని అడిగాడు. ఇంతలో ఒక పెద్ద మూట మోసుకుంటూ బీర్బల్ సభలోకి వచ్చాడు. "ఏమిటా మూట?" అని అడిగాడు అక్బరు. "ఆకాశంలో ఉన్న నక్షత్రాల లెక్క మహాప్రభూ!" అన్నాడు బీర్బల్. "చూపించండి," అన్నాడు అక్బరు. మూట విప్పాడు బీర్బల్. ఆ మూట నిండా ఆవాలు! అక్బరు ఆశ్చర్యపోయాడు. "ఏమిటివి?" అని అడిగాడు. "ఆకాశంలో చూస్తూ నక్షత్రాలు లెక్కపెట్టడం కష్టం కదా! అందుకే ఒక్కొక్క నక్షత్రానికి ఒక్కొక్క ఆవగింజను పక్కన పెడుతూ వచ్చాను. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అన్ని ఆవగింజలు ఈ మూటలో ఉన్నాయి ప్రభూ!" అని చెప్పాడు బీర్బల్.

"బాగానే ఉంది. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అన్ని ఆవాలూ ఇక్కడ ఉన్నాయా?"



© SCERT not to be republished

అంటూ సందేహంగా అడిగాడు అక్బరు. "ఓ, కచ్చితంగా ఉన్నాయి ప్రభూ!" అని చెప్పాడు బీర్బల్. "కావాలంటే ముందుగా మీరు ఆవాలు లెక్కపెట్టుకొని తరవాత నక్షత్రాలు లెక్కపెట్టండి. అప్పుడు లెక్క సరిపోయినదీ, లేనిదీ తెలుస్తుంది," అని మళ్ళీ చెప్పాడు బీర్బల్.


అక్బరు బీర్బల్ తెలివితేటల్ని మెచ్చుకున్నాడు. నవ్వుతూ బీర్బల్‌కు వెయ్యి బంగారు నాణేలు బహూకరించాడు.



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) ఈ కథను సొంతమాటల్లో చెప్పండి?

(ఆ) చుక్కల్ని లెక్కించగలమా? లెక్కించలేమా? ఎందుకు?

(ఇ) మీకు ఆశ్చర్యం కలిగించిన సంఘటనలు చెప్పండి?

### II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం చదవండి. కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో చెప్పండి.

1. "బీర్బల్‌గారు ఏరీ....?"
2. "ఏమిటా మూట?"
3. "నక్షత్రాల లెక్క మహాప్రభూ!"
4. "ఆకాశంలోకి చూస్తూ నక్షత్రాలను లెక్కపెట్టడం కష్టం కదా!"
5. "చూపించండి"

(ఆ) కింది వాక్యాలు చదవండి. పాఠం చదివి తప్పు (×) ఒప్పు (✓) లను గుర్తించండి.

1. అక్బరు తోటలో పచార్లు చేస్తున్నాడు. (   )
2. నక్షత్రాలను లెక్కించి చెప్పినవారికి తన రాజ్యాన్ని ఇస్తానని అక్బరు చెప్పాడు. (   )
3. నక్షత్రాల్ని లెక్కించడానికి పదిహేను రోజులు గడువిచ్చాడు. (   )
4. బీర్బల్ సభలోకి పెద్ద డబ్బాను మోసుకొచ్చాడు. (   )
5. బీర్బల్ నక్షత్రాలను బియ్యపు గింజలతో లెక్కించాడు. (   )

© SCERT not to be republished

**(ఇ) పాఠం చదివి, తారుమారైన పదాలను సరైన క్రమంలో ఉంచి వాక్యాలు రాయండి.**

1. చూసుకున్నారు, ఒకరి, ఒకరు, ముఖాలు
2. బహుమతి, లెక్కించినవారికి, నాణేలు, బంగారు
3. వచ్చాడు, పెద్దమూటతో, సభకు, బీర్బల్
4. వెయ్యి, బహూకరించాడు, బంగారునాణేలు, బీర్బల్‌కు
5. ఆవాలు, నిండా, ఆ మూట, ఉన్నాయి.

**(ఈ) పాఠంలో 'ా', 'ి', 'ీ', 'ు', 'ూ' ఉన్న పదాలను గుర్తించి రాయండి.**

| | ా | ి | ీ | ు | ూ |
|---|---|---|---|---|---|
| ఉదా : | పాదుషా | మిలమిల | బీర్బల్ | రెండు | మూట |
| | | | | | |

## III రాయండి



**(అ) అక్బర్‌కు తాను చేసిన పనికి తనకే నవ్వు వచ్చింది. ఏమా పని? ఎందువల్ల?**

**(ఆ) బీర్బల్ గురించి ఐదు వాక్యాలు రాయండి.**

**(ఇ) కథను సొంతమాటల్లో రాయండి.**

## IV పదజాలం

**(అ) గీత గీసిన పదానికి సమానమైన అర్థం వచ్చే పదం పాఠంలో ఉంది. పాఠం చదివి ఆ పదాన్ని గుర్తించి వాక్యం తిరిగి రాయండి.**

1. చుక్కలు మిలమిల మెరుస్తున్నాయి.

   నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నాయి.

2. పాదుషా తమను ఆటపట్టిస్తున్నాడేమోనని సందేహం వచ్చింది.

   ..................................................................................................

3. వేయి బంగారునాణేలు కానుక గా ఇస్తామన్నాడు.

   ..................................................................................................

4. ఆయన తెలివితేటల్ని అక్బర్ మెచ్చుకున్నాడు.


   ..................................................................................................

5. అక్బరు నింగి వైపు చూశాడు.

   ..................................................................................................


© SCERT not to be republished

(అ) కింది పదం చదవండి. దానికి సంబంధించిన పదాలు రాయండి. వాటితో వాక్యాలు రాయండి.




ఉదా : ఆకాశంలో పక్షులు ఎగురుతున్నాయి.

## V సృజనాత్మకత



(అ) పెద్ద మూటతో సభకు వచ్చిన బీర్బల్‌కు, అక్బరుకు మధ్య జరిగిన సంభాషణ రాయండి.

అక్బర్ : ఏమిటా మూట ?

బీర్బల్ : నక్షత్రాల లెక్క ప్రభూ!

అక్బర్ : ఏదీ చూపెట్టు.

బీర్బల్ :

అక్బర్ :

బీర్బల్ :

అక్బర్ :

బీర్బల్ :

అక్బర్ :

(ఆ) ఆకాశంలో చంద్రుడు, నక్షత్రాలు ఉన్నట్లు చిత్రం గీయండి. రంగులు వేయండి. దాన్ని గురించి రాయండి.

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) ఏదైనా తెలివైన పని చేస్తే అందరూ మెచ్చుకుంటారు కదా! ఎలా మెచ్చుకుంటారు?

తెలుగులో : బాగుంది! బాగా చేశావు.

ఇంగ్లీషులో :


హిందీలో :

మీకు తెలిసిన ఇతర భాషల్లో :

©SCERT not to be republished

(ఆ) మీ పాఠశాల గ్రంథాలయం నుంచి, దినపత్రికల నుంచి అక్బర్-బీర్బల్ కథలను సేకరించండి. తరగతిగదిలో ప్రదర్శించండి. ఎవరు సేకరించిన కథ బాగుందో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది పేరాను చదవండి. '!', '?' గుర్తులు ఎక్కడ ఉన్నాయో చూడండి.

అబ్బో విమానం ఎంత ఎత్తులో ఎగురుతూ ఉందో! ఈ విమానం ఎక్కడికి పోతూంది? విమానం మన ఊరిలో దిగితే బాగుంటుంది కదూ! విమానంలో ఎంతమంది మనుషులు కూర్చోవచ్చు? విమానానికి చక్రాలు ఉంటాయా?

'?' దీన్ని **ప్రశ్న గుర్తు** అంటారు. ఇది ప్రశ్నరూపంలోని వాక్యం చివర ఉంటుంది. "!" దీన్ని **ఆశ్చర్యార్థకపు గుర్తు** అంటారు. ఆశ్చర్యం కలిగించే చోట విశేషమైన చోట గుర్తును ఉంచుతారు.

పాఠం చదవండి.?, ! గుర్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆ వాక్యాల కింద గీతలు గీయండి.

(ఆ) సీత పట్నం వెళ్ళింది. ఆమె అక్కడ సినిమా చూసింది.
గీతలు గీసిన పదాలను గమనించండి.

**'సీత', 'పట్నం'** నామవాచక పదాలు. ఈ పదాలకు బదులుగా **'ఆమె', 'అక్కడ'** అనే పదాలను వాడాం. ఇలా నామవాచకాలకు బదులుగా వాడే పదాలను **'సర్వనామాలు'** అంటాం.

(ఇ) కింది వాక్యాలలో నామవాచకాలకు బదులు సర్వనామాలను ఉపయోగించి రాయండి.

1. శివయ్య పొలానికి వెళ్ళాడు. శివయ్య పొలంలో కూరగాయలు కోశాడు.
2. రాజు, శివ మంచి స్నేహితులు. రాజు, శివ ఇద్దరూ కలిసి ఆడుకోడానికి వెళ్ళారు.
3. పావురాలు నేలమీద వాలాయి. పావురాలు వలలో చిక్కుకున్నాయి.
5. మాధవి వరంగల్లు వెళ్ళింది. మాధవి వరంగల్లులో బట్టలు కొన్నది.

©SCERT not to be republished



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. కథను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. అక్బర్‌కు, బీర్బల్‌కు మధ్య జరిగిన సంభాషణను రాయగలను. | ఔను / కాదు |